తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి

పెద్దపల్లి | జగిత్యాల

గురువారం
25 జూన్ 2026

పేజీలు : 8

Follow :



## నూతన కలెక్టరేట్లో పలు నిర్మాణాలకు శంకుస్థాపన

### హాజరైన ఎమ్మెల్యే, మేయర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి..

కరీంనగర్ బ్యూరో, జూన్ 24 (జనంసాక్షి) : శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ కరీంనగర్ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద హెలిప్యాడ్ నిర్మాణం, సర్వీస్ రోడ్డు, హెలిప్యాడ్ కు ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసేందుకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. 53 లక్షల రూపాయల సుడా నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణాలకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కొత్త కలెక్టరేట్ నుండి ఈశాన్యం గేట్ వరకు రహదారి అభివృద్ధి పనులు గార్డెన్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రెండు పనులను కోటి ఇరవై లక్షలతో చేపట్టనున్నారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ... నిర్ణీత కాలవ్యవధిలోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లా వాసులకు ఇలాంటి మౌలిక వసతుల కల్పన ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, ఆర్ అండ్ బి ఈ. నరసింహ చారి పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ఆర్మూర్ మున్సిపల్ లో అక్రమ నిర్మాణాల జోరు..

**ఆర్మూర్,జూన్ 24(జనంసాక్షి):**
ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. అక్రమార్కులు మున్సిపాలిటీ కార్యాలయం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అడ్డగోలుగా నిర్మాణాలను జోరుగా చేపడుతున్నారు.అనుమతి ఒకటి.. నిర్మాణం మరొకటి చేస్తూ మున్సిపాలిటీకి ఆదాయాన్ని గండి కొడుతున్నారు.మరో పక్క అనుమతి కొంత తీసుకొని నిర్మాణం మరింత అన్నట్టు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.అక్రమార్కులకు మున్సిపాలిటీ అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలతోనే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.టౌన్ ప్లానింగ్ కిందిస్థాయి సిబ్బంది సైతం ముందస్తుగానే అక్రమ నిర్మాణాల నుండి వసూళ్లకు పాల్పడి,వారి జేబులు నింపుకుంటున్నారని ప్రధాన ఆరోపణమూట కట్టుకుంటున్నారు.అక్రమ నిర్మాణాల పై మున్సిపాలిటీ అధికారులు చర్యలు తీసుకోకుండా నిద్రమత్తులో మునిగిపోతున్నారన్న విమర్శలున్నాయి.

**టౌన్ ప్లానింగ్ అధికారి మౌనమెందుకు..?**
ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో విచ్చలవిడిగా సెల్లార్లు, బిల్డింగ్ లకు ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయి.అక్రమ నిర్మాణాలు జరుగుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి,మున్సిపల్ శాఖ అధికారులు మౌనంగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అక్రమ నిర్మాణాలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడొద్దు..

- 3వేల మంది విద్యార్థుల మృతికి మోడీ సమాధానం చెప్పాలి..
- సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు..
- కేంద్ర ప్రభుత్వంపై రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ ఆగ్రహం..

**గోదావరిఖని, జనంసాక్షి :**
దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని, కానీ ప్రస్తుతం అమలవుతున్న విద్యా విధానాలు విద్యార్థులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ ఆరోపించారు. గోదావరిఖనిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి, యువజన సంఘాల సమావేశంలో మాట్లాడిన **మిగతా3లో**

## ఐకేపీ-డీఆర్డీఏ-ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య శిబిరం

### ఉద్యోగులు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి : జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధిజూన్ 24 (జనంసాక్షి )**
జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఐకేపీ, డీఆర్డీఏ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందికి ప్రత్యేక ఉచిత ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. SERP & SRDS Election Insurance TPA Private Limited వారి సౌజన్యంతో, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ శిబిరానికి విశష స్పందన లభించింది. మొత్తం 263 మంది ఉద్యోగులు పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో రక్తపోటు (బీపీ), రక్తంలో చక్కెర స్థాయిలు (షుగర్), ఈసీజీ, 2డీ ఎకో, కంటి పరీక్షలు తదితర వైద్య పరీక్షలను నిపుణులైన వైద్యులు నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి వైద్య సూచనలు, తదుపరి చికిత్సలపై సలహాలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, ప్రజాసేవలో నిరంతరం కృషి చేస్తున్న ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణ అత్యంత అవసరమని అన్నారు. విధి నిర్వహణలో పని ఒత్తిడి, ప్రయాణాలు, క్షేత్రస్థాయి బాధ్యతల మధ్య ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.





కార్యాలయ ప్రాంగణంలోనే వైద్య సేవలు అందించడం వల్ల ఉద్యోగులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించే అవకాశం కలుగుతుందని తెలిపారు.ఉద్యోగుల సంక్షేమం కోసం తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థ సీఈవో, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ దివ్య దేవరాజన్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, సంక్షేమం, సేవల సామర్థ్యం పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, ఇలాంటి కార్యక్రమాలు తరచూ నిర్వహించడం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెరిగి పనితీరు మెరుగుపడుతుందని అన్నారు.శిబిరాన్ని అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, డీఆర్డీఓ దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్డీఓ విజయలక్ష్మి సందర్శించి వైద్య సేవల అమలును పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణలో ఎలక్షన్ కోఆర్డినేటర్ పవన్ కీలక పాత్ర పోషించారు.

ఆరోగ్య శిబిరంలో యశోద ఆసుపత్రి వైద్య బృందంతో పాటు నిజామాబాద్‌కు చెందిన మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొని సేవలందించారు.

# యువతను ప్రమాదంలోకి నెట్టే మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## మంథనిలో మాదక ద్రవ్యాల వ్యతిరేక, అవగాహన కార్యక్రమంలో ఏసిపి రమేష్

**మంథని, (జనంసాక్షి) :** ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రమాదం ఉందని గోదావరిఖని ఏసిపి రమేష్ హెచ్చరించారు. మంథని పట్టణంలో నిర్వహించిన మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ యువతకు పలు సూచనలు చేశారు. చిన్న చిన్న తప్పులు చేసి పోలీసు కేసుల్లో ఇరుక్కోవడం యువత బంగారు భవిష్యత్తును దెబ్బతీస్తుందని, ముఖ్యంగా ఆధార్ కార్డుతో అనుసంధానమైన పోలీసు రికార్డులు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలకు తీవ్ర ఆటంకంగా మారతాయని ఆయన పేర్కొన్నారు. మత్తు పదార్థాల అమ్మకాలు మరియు సోషల్ మీడియా వేదికల ద్వారా జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు వ్యవస్థ నిరంతరం నిఘా ఉంచుతుందని, తెలియకుండా చేసే పొరపాట్లు కూడా జీవితాన్ని ఇబ్బందుల్లోకి నెడతాయని ఆయన హెచ్చరించారు. కష్టపడి పనిచేస్తూ, తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని ఎన్నో




ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రుల కలను సాకారం చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని, క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని అలవరచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంథని సిఐ బుద్ధే స్వామి, ఎస్ఐ రమేష్ ఏఎస్ఐ మల్లేశం, తదితరులు పాల్గొన్నారు. వీరంతా యువతకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాల గురించి వివరిస్తూ, సమాజంలో ఆరోగ్యకరమైన మార్పు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్మికులకు రక్షణ కిట్లను అందించాలి

### మాజీ వార్డ్ మెంబర్ పురం శేఖర్



**ఎడపల్లి, జూన్ 24 (జనంసాక్షి )** మేడిపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్మికులకు రక్షణ కిట్లను అందించాలని కోరుతూ బుధవారం మాజీ వార్డ్ మెంబర్ పురం శేఖర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగాధర్ కు వినతిపత్రం అందించారు. ప్రస్తుత వర్షాకాలంలో గ్రామపంచాయతీ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేసేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అందువల్ల వారికి వెంటనే రక్షణ కిట్లను అందించాలన్నారు. వర్షాకాలంలో మురికి కాలువలో దుర్గంధం వెదజల్లే అవకాశం ఉందని అంతేకాకుండా బురద నెలలో నడవాల్సి వస్తుందని అందువల్ల వారి ఆరోగ్యం పాడుకాకుండా ఉండేందుకు వెంటనే రక్షణ కిట్లను అందించి వారి ఆరోగ్యాలను కాపాడాలని మాజీ వార్డ్ మెంబర్ పురం శేఖర్ కోరారు.



## డ్రైనేజీ శుభ్రత ప్రత్యేక డ్రైవ్‌లో మూడు ట్రాక్టర్ల ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

### మేయర్ ఆదేశాలతో విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమం.. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి

**కరీంనగర్ టౌన్, జూన్ 24 ( జనం సాక్షి)** కరీంనగర్ నగరంలోని కోర్టు నుంచి శివ థియేటర్ వరకు ఉన్న ప్రధాన రోడ్డులో మేయర్ ఆదేశాల మేరకు ప్రత్యేక డ్రైనేజీ శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజీల్లో పేరుకుపోయిన భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించగా సుమారు మూడు ట్రాక్టర్ల మేర వ్యర్థాలు బయటపడ్డాయి.వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, గృహ వ్యర్థాలు అధికంగా పేరుకుపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోతున్నట్లు గుర్తించారు. పారిశుద్ధ్య సిబ్బంది, యంత్రాల సహాయంతో కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మేయర్, నగర పరిశుభ్రత కోసం ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీలు, కాలువల్లో వేయకుండా చెత్త సేకరణ కేంద్రాలకు అందించాలని సూచించారు.నగరంలో పరిశుభ్రతను మెరుగుపరచడం, వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలను నివారించడం కోసం ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు. ప్రజల సహకారంతో కరీంనగర్‌ను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## మహిళా సాధికారత తెలుగు అసోసియేషన్ మండల కోఆర్డినేటర్ గా చెల్పూర్ సర్పంచ్ వంతడుపుల కస్తూరి



**హుజురాబాద్, జూన్ 24 (జనంసాక్షి)** మహిళల అభివృద్దే ధ్యేయంగా స్థాపించిన సంస్థ మహిళా ఎంపవర్ మెంట్ తెలుగు అసోసియేషన్ గత 40 సంవత్సరాలుగా హనుమండ్ల ఝాన్సీ రెడ్డి పేద, వెనకబడిన మహిళల అభివృద్దే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ సంస్థ ఎన్నో సేవ కార్యక్రమాలు చేయడం జరిగింది. ప్రభుత్య పాఠశాలలు, ఆసుపత్రులు, లైబ్రరీలు కట్టించి సేవలు అందిస్తున్నారు. ఉద్దేశంతో ఇపుడు మన రాష్ట్రంలోని మహిళల విద్య, వైద్యం, ఆర్థికంగా, సామాజికంగా, సేవా రంగాలలో ఎదగాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ సంస్థకు మన హుజురాబాద్ మండల కోఆర్డినేటర్ గా విద్యావంతురాలు, చెల్పూర్ గ్రామ సర్పంచ్, సమాజ సేవ చేయాలనే సంకల్పం కలిగిన వ్యక్తి వంతడుపుల కస్తూరిని ఎంపిక చేయడం జరిగింది. బుధవారం హైదరాబాద్ జూబ్లీ కన్వెన్షన్ హాల్లో జరిగిన అవగాహన సదస్సుకు సర్పంచ్ హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, శిక్షణ, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పాల్గొని మహిళల అభివృద్ధికోసం చక్కటి వేదికను ఏర్పాటు చేసిన ఝాన్సీ రెడ్డిని అభినందిస్తూ కో ఆర్డినేటర్ అందరు సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల కోఆర్డినేటర్ వంతడుపుల కస్తూరి మాట్లాడుతూ... మన హుజురాబాద్ మండలంలో చదువుకోవటంలో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ప్రతి అమ్మాయికి చేయూత అందిస్తానని, ప్రతి మహిళ అన్ని రంగాలలో ఎదగడానికి నా వంతు కృషి చేస్తానని, మహిళలకు ఏ ఆపద వచ్చిన ముందుంటా అని తెలియజేశారు. కోఆర్డినేటర్ గా సర్పంచ్ కస్తూరి ఎన్నిక కావడం పట్ల మండల నాయకులు, ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

### హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి సీఐటీయూ డిమాండ్

**మానకొండూర్, జూన్ 24 ( జనం సాక్షి)** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పునూటి శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ మానకొండూరు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కార్యదర్శికి గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, అనేక సంవత్సరాలుగా గ్రామపంచాయతీ కార్మికులు తక్కువ వేతనాలతో పనిచేస్తున్నప్పటికీ వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తామని, ఉద్యోగాలను శాశ్వతం చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీల అమలులో పురోగతి కనిపించడం లేదన్నారు.ఇతర శాఖల ఉద్యోగులకు ట్రెజరీల ద్వారా నేరుగా వేతనాలు చెల్లిస్తున్న విధంగానే గ్రామపంచాయతీ సిబ్బందికి కూడా ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా గ్రామపంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా విధి నిర్వహణలో లేదా ఇతర కారణాలతో మరణించిన కార్మికుల కుటుంబాలకు అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని, గ్రామపంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరినట్లు తెలిపారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రాబోయే వర్షాకాలంలో నిరవధిక సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్స్ మండల నాయకులు బుడిగె అంజయ్య, బరిగల మల్లయ్య, ఎలుకపల్లి సారయ్య, బరిగల మల్లవ్వ, మానకొండూరు మండల నాయకులు రాజు, కే. సంపత్, జి. రంజిత్, ఎం. సరూప, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమం నిర్వహణ

### తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు వినూత్న కార్యక్రమం

**కరీంనగర్ జిల్లా జూన్ 24 (జనంసాక్షి):** పూజ్య గురువులు శ్రీ సురేష్ ఆత్మారామ్ మహరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సభ్యులు పాల్గొని సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు.ఈ సందర్భంగా శ్రీ సురేష్ ఆత్మారామ్ మహరాజ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీడ్ బాల్స్ తయారు చేసి అడవులు, కొండ ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో విసరడం ద్వారా మొక్కలు మొలిచి అడవుల విస్తీర్ణం పెరుగుతుందని తెలిపారు. ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు ఈ కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభా అవసరాల కోసం అడవులను నరికి వేయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందన్నారు.



అడవుల నాశనం కారణంగా అడవి జంతువులు గ్రామాలు, పట్టణాల్లోకి ప్రవేశించడం, పంటలకు నష్టం కలగడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వంటి సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని తెలిపారు. అలాగే చెట్ల కొరత కారణంగా ఉష్ణోగ్రతలు 45 నుండి 48 డిగ్రీల వరకు పెరిగి మానవాళికి తీవ్రమైన ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఇజ్జగిరి శ్రీనివాస్, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్-9 ప్రెసిడెంట్, తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటకపోతే రాబోయే సంవత్సరాల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ కనీసం పది మొక్కలు నాటే సంకల్పంతో పాటు సీడ్ బాల్స్ తయారు చేసి ఖాళీ ప్రదేశాల్లో విసరడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా శ్రీనివాస మిత్రులు గురువు సీడ్ బాల్స్ తయారీ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి సభ్యులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ సభ్యులు పెద్ది శ్రీనివాస్, చొక్కారపు శ్రీనివాస్, శ్రీనివాస్ రావు పర్యావరణ ప్రేమికులు సతీష్ రావు తదితరులు పాల్గొన్నారు.

### రామగుండం తహసీల్దార్ కార్యాలయంలో..

## కులం, నివాసం ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించడంలో జాప్యం..

- ఆందోళనలో విద్యార్థులు.. తల్లిదండ్రులు..
- జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి..
- టీఆర్ఎస్ డి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్..

**అంతర్గాం, జనంసాక్షి:**



విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యార్థిని విద్యార్థులకు రామగుండం రెవిన్యూ కార్యాలయం నుండి కులం, నివాసం, ఆదాయం ధ్రువీకరణ పత్రాలు అందించడంలో గత 15 రోజుల నుండి రామగుండం తహశీల్దార్ కార్యాలయం పూర్తిగా విఫలమయ్యారని టీఆర్ఎస్ డి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ అన్నారు. కార్యాలయంలో ఆపరేటర్ అందుబాటులో ఉండక పోవడంతో.. విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్ లు సకాలంలో అందక పోవడం తో విద్యార్థుల ఉన్నత చదువులకై భవిష్యత్ ప్రశ్నార్థకరంగా మారిందన్నారు.ఎంసెట్ కు క్వాలిఫై అయినా విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్ ద్వారా ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో చదవాలనుకునే వారికి కులం,ఆదాయం నివాసం ధ్రువీకరణ పత్రాలు తప్పని సరిగా ఉండాలి ఎంసెట్ కౌన్సెలింగ్ కోసం రోజు వారీగా స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు ఎంసెట్ కౌన్సెలింగ్ లో అధికారులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించాల్సి వున్నది. ఎంసెట్ కౌన్సెలింగ్ గోదావరిఖని లో మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉన్నందున విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళనలకు గురవుతున్నారు. పెద్దపల్లి జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపి ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందించాలని తెలంగాణ రక్షణ సమితి డెమొక్రటిక్ పార్టీ పక్షాన కోరుతున్నానని ఈదునూరి నర్సింగ్ పేర్కొన్నారు.

### శ్రీరాముల వీరాచారి కుటుంబాన్ని

## ప్రభుత్వం ఆదుకోవాలి..

**అఖిల భారత విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ..**



**చిగురుమామిడి జూన్ 24 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామంలో అఖిలభారత విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల పదహారు(16) మంగళవారం రోజున విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన పేద కుటుంబం రోడ్డున పడిందిఅని,కుటుంబాన్ని పోషించే యజమాని యజమాని శ్రీరాముల వీరాచారి అప్పుల బాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు.గత ఆరు నెలల నుండి సరైన వృత్తి పని సాగక కుటుంబ అవసరాలకు సరిపడా డబ్బులు దొరకక భార్యా ఇద్దరు పిల్లలను పోషించలేక చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై వారు తను ఆత్మహత్య చేసుకోవడం జరిగిందన్నారు. ఆత్మహత్య ఈ మధ్యకాలంలో అనేకమంది కార్పెంటర్లు ఆత్మహత్యలు చేసుకోవడం వెనుక అనేక కారణాలు ఉన్నాయి.గ్రామాల్లో కులవృత్తులు కనుమరుగై కర్రకు బదులు ఫైబరు ప్లాస్టిక్ రావడం ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుండి అనేక రకాల కార్మికులు మన రాష్ట్రానికి రావడం వలన ఇక్కడి కార్మికుల వృత్తులు కూలిపోవడం వలన తెలంగాణలో విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన కార్మికులు దిక్కుతో చని స్థితిలో ఉన్నారు.కావున ప్రభుత్వము కార్మికులకు ఎదురవుతున్న పరిస్థితులపై చర్యలు చేపట్టాలి తెలంగాణ వృత్తి కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక అభివృద్ధి కల్పించాలని వారు కోరారు.అఖిల భారత విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త పెల్లి సత్యనారాయణ వారితోపాటు చిగురుమామిడి మండలానికి సంబంధించిన సంఘ నాయకులు విశ్వపతి లింగమూర్తి,మంతెన శ్రీకాంత్, సత్యనారాయణ,కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు నారాయణస్వామి పాల్గొని వారి కుటుంబానికి నిత్యావసర వస్తువులు అందించడం జరిగినది.

## మూడు నెలలైనా ముందుకు సాగని నిర్మాణం

**○ఇప్పట్లో మార్కెట్ షెడ్ నిర్మాణం జరిగేనా ○పంచాయతీ పాలకవర్గంలో కొరవడిన సమన్వయం**

**గంభీరావుపేట జూన్ 24 (జనం సాక్షి);**



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మార్కెట్ షెడ్ నిర్మాణం ఇప్పట్లో జరిగేటట్టుగా కనిపించడం లేదు. పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యం గంభీరావుపేట మండల కేంద్రంలో మూడు నెలలైనా నిర్మించ తలపెట్టిన మార్కెట్ షెడ్ నిర్మాణపు పనులు ముందుకు సాగడం లేదు. రూ. 10 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్, రూ.5 లక్షలతో మార్కెట్ షెడ్ నిర్మాణానికి పాలకవర్గం మార్చి నెలలో న భూమి పూజ నిర్వహించారు. వర్షాకాలం ఆరంభం లోపు షెడ్ నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో షెడ్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు పనులు మాత్రం ఇక్కడ వేసిన గొంగళి అక్కడి మాదిరిగానే నెలకొంది. పనులు మాత్రం మొదలు కాకపోవడంతో నిత్యం కూరగాయలు విక్రయించే విక్రయదారులు ఎండకు ఎండుతూ వానకు నానుతూ విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇదివరకు ఉన్న షెడ్డు మాదిరిగా కాకుండా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా షెడ్డు నిర్మాణం జరపాలని ఉప సర్పంచ్ మూడు రకాల షెడ్డు నిర్మాణాల నమూనాలతో ఇటీవల సంతకాల సేకరణ చేపట్టి వివాదాస్పదమై వార్డు సభ్యులపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు వరకు వెళ్ళింది. మార్కెట్ షెడ్ నిర్మాణ విషయమై ఇక్కడ జరుగుతున్న విషయం కాస్త సిరిసిల్ల ప్రాంత ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా 40 లక్షల వరకు తన సొంత నిధులతో మార్కెట్ షెడ్ నిర్మాణం చేపడతామని తెలిపినట్లు ప్రాంత బీఆర్ఎస్ నాయకులు చెప్పుకోవడం జరిగింది. ఇది జరిగి నెల కావస్తున్న అటు ఎమ్మెల్యే నిధులు ద్వారా కానీ, ఇటు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల్వారా కానీ పనులు జరగడం లేదు. పంచాయతీ పాలకవర్గ సభ్యులలో సమన్వయం లేకపోవడంతో నిర్మాణం జరగడంలో జాప్యం జరుగుతుందని ప్రజలు వారి తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడిగా నిత్యం మార్కెటింగ్ జరిగే మండల కేంద్రంలో ఇతర గ్రామాల నుండి వచ్చి రైతులు ఇక్కడ కూరగాయలు విక్రయిస్తుంటారు. సరైన నిలువ నీడ లేకపోవడం విక్రయదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలకవర్గం ఎవరికివారు పట్టువిడుపులకు వెళ్లకుండా చేపట్టదలచిన నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

### విద్యార్థుల భవిష్యత్తుతో

## చెలగాటం ఆడొద్దు..

ఆయన, కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా విద్యార్థులు ఆత్మహత్యల వైపు నెట్టబడుతున్నారని ఆరోపించారు.ప్రత్యేకంగా నీట్ పరీక్షల నిర్వహణ, ప్రశ్నాపత్రాల లీకేజీలు, కోచింగ్ సెంటర్ల ఒత్తిడి, పెరుగుతున్న విద్యా వ్యయం వంటి అంశాలు విద్యార్థుల జీవితాలను దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు నిరాశతో ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది అత్యంత విషాదకరమని అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా మూడువేల మంది విద్యార్థులు తనువు చాలించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం లక్షల రూపాయలు ఖర్చు చేసి చదివిస్తున్నప్పటికీ, చదువు పూర్తయిన తర్వాత సరైన ఉద్యోగ అవకాశాలు లేకపోవడం యువతలో ఆందోళన పెంచుతోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ తగ్గిపోవడం, నిరుద్యోగం పెరగడం వల్ల చదువుకున్న యువత కూడా చిన్నచిన్న ఉద్యోగాల కోసం పోటీ పడుతున్నారని అన్నారు.దేశంలోని విద్యార్థులు, యువత ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అన్యాయాలపై పోరాటం చేయాలని, విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని కోరారు. విద్యార్థుల సమస్యలను రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గుర్తించాలని, కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల భవిష్యత్తు, దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందని, అందుకే విద్యా వ్యవస్థలో సంస్కరణలు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల ప్రాణాలను కాపాడేందుకు, ఒత్తిడి లేని విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు సమాజంలోని ప్రతి వర్గం కలిసి రావాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో రామగుండం నగరపాలక సంస్థ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు. బొంతల రాజేష్, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



## నూతన ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్లు, ఉపసర్పంచ్లు

**సిరికొండ జూన్ 24 (జనంసాక్షి):** సిరికొండ మండల నూతన ఎంపీడీఓ మహమ్మద్ రఫీ అహ్మద్ను బుధవారం మండల కార్యాలయంలో పెద్ద వాల్గొట్ గ్రామ సర్పంచ్ వనిత నర్సింగ్, ఉపసర్పంచ్ టీ. రాము, గడ్కోల్ గ్రామ సర్పంచ్ సంద్ర లత శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, వివిధ అభివృద్ధి పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంపై ఎంపీడీఓతో చర్చించారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మహమ్మద్ రఫీ అహ్మద్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ పారదర్శక పాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద వాల్గొట్ గ్రామ కారోబార్ చింటూ, పలువురు గ్రామ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన కౌన్సిలర్ గుమ్ముల అశోక్ రెడ్డి

**బోధన్, జూన్ 24 ( జనంసాక్షి ) :**



బోరింగ్ పట్టణంలోని 15వ వార్డులో గల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పుస్తకాలను వార్డు కౌన్సిలర్ గుమ్ముల అశోక్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తారని అందువల్ల విద్యార్థులు తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోనే తమ పిల్లలను చేర్పించాలన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని 15వ వార్డు కౌన్సిలర్ గుమ్ముల అశోక్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలకు జాతీయ స్థాయి గుర్తింపు

## ✧స్వచ్ఛ విద్యాలయ అవార్డుకు ఎంపిక ✧అవార్డుపట్ల పలువురి ప్రశంసలు





**సిరిసిల్ల టౌన్ జూన్ 24 (జనం సాక్షి)**
కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ విద్యాలయ 2026 పురస్కారానికి సిరిసిల్లలోని నెహ్రూ నగర్ ప్రాథమిక పాఠశాల ఎంపికైంది. ఈ పురస్కారాలకు గాను రాష్ట్రం నుండి పది పాఠశాలలు ఎంపిక కాగా మన సిరిసిల్ల జిల్లా నుండి ఎం.పి.హెచ్.ఎస్ జాతీయస్థాయిలో అవార్డుకు ఎంపిక కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పాఠశాలలో శుభ్రత, పరిశుభ్రత**
పాఠశాల సందర్శనలో హ్యాండ్ వాష్, ఇంకుడు గుంత, పరిసరాల పరిశుభ్రత, తడి చెత్త పొడి చెత్త నిర్వహణ, బడి తోట, ఇవన్నీ మనకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాఠశాల నిర్వహణలో ఎంతో అంకితభావాన్ని ప్రదర్శిస్తున్నట్లు కనబడుతుంది. విద్యార్థులు చదువులో రాణిస్తూ ఆటపాటలే గాకుండా వారు చేసే దినచర్యలో కాలకృత్యాలు తీర్చుకోవడంలో కనబరుస్తున్న పటిమ మనల్ని పిల్లల లోకంలోకి తీసుకువెళతది. పిల్లలను మాట్లాడించినాజంకు బొంకు లేకుండా వారు మాట్లాడిన తీరు ఆశ్చర్యం గొలుపుతుంది. మధ్యాహ్న భోజన వసతిలో క్రమశిక్షణా చర్యలు ఎంతో ఆకట్టుకుంటాయి. జాతీయస్థాయి పరిశీలకులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పరిశీలించిన తర్వాతే జాతీయ స్థాయి గుర్తింపు ఇవ్వడం జరుగుతుంది. కాగా ఈ పాఠశాలకు జాతీయస్థాయి అవార్డు రావడం వెనుక రిటైర్డ్ హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం, జిల్లా విద్యాధికారులు, ప్రజాప్రతినిధుల ప్రోత్సాహం ఉన్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వాసాల హరిప్రసాద్ తెలిపారు.

**విద్యార్థులకుసామాజిక అవగాహన**
పిల్లలకు విద్యతో పాటు, సామాజిక పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పాలిథిన్ కవర్లపై, ఆరోగ్యరీత్యా తీసుకునే ఆహారం పట్ల, మాదక ద్రవ్యాల పట్ల, ఇతరుల పట్ల గౌరవభావం, భావవ్యక్తీకరణ లాంటివన్నీ ఉపాధ్యాయ బృందం అవగాహన కల్పిస్తుందని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లల తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు చర్చిస్తుంటామని వివరించారు. ఈ ప్రాథమిక పాఠశాలకు జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల చాలా సంతోషంగా ఉందన్నారు. సలహాలు, సూచనలు ఇచ్చి ఉపాధ్యాయ బృందాన్ని ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ అవార్డు రావడం పట్ల పిల్లల తల్లిదండ్రులు, నెహ్రూ నగర్ పట్టణవాసులు పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల్ని ప్రశంసించారు.







# సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు ఏమైంది..

- నిల్వలు చూపించడానికి యాజమాన్యం ఎందుకు భయపడుతోంది..
- టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి..

**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు ఏమైందని ప్రశ్నిస్తే యాజమాన్యం ఉలిక్కిపడుతోందని టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. వాస్తవాలను వెల్లడించాల్సిన అధికారులు, స్పష్టమైన సమాధానాలు ఇవ్వకుండా ఊకదంపుడు ప్రెస్‌మీట్లు నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. బొగ్గు రవాణాలో లోపాలు గానీ, రవాణా జరిగిందని బీఆర్ఎస్ లేదా టీబీజీకేఎస్ ఎక్కడా ఆరోపించలేదని, ఈ 40 లక్షల నిలువలపై జరిగిన తప్పిదాలు గొప్పలకు పోయి సత్యం రామలింగరాజు కుంభకోణం హర్షద్ మెహతా కుంభకోణం లా ఉందని వారు పేర్కొన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గు లెక్కలపై సందేహాలు వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. అసలు విషయాన్ని పక్కదారి పట్టించేందుకు సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ కార్మికులను తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించడం యాజమాన్యం భ్రమ అని అన్నారు. బొగ్గు పక్కదారి పట్టలేదని చెబుతున్న అధికారులు, సంబంధిత బొగ్గు నిల్వల వివరాలను బహిరంగంగా చూపించడానికి సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. కొందరు అధికారులు సింగరేణి ప్రైవేటీకరణకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. కొన్ని కార్మిక సంఘాలు యాజమాన్యంతో గొంతు కలపడం దురదృష్టకరమని, బొగ్గు నిల్వలపై ప్రశ్నించాల్సిన వారు తమపై విమర్శలు చేయడం ద్వారా కార్మికులను మోసం చేస్తున్నారని అన్నారు. యాజమాన్యానికి వత్తాసు పలకడం గుర్తింపు ప్రాతినిధ్యా సంఘాల పని అయిందని ఈ వత్తాసు పలకడం మానీ కార్మికుల సంక్షేమ, మెడికల్ బోర్డు నిర్వాహన తదితర అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు ఈ విషయాన్ని కార్మికులందరు గమనించాలని మిర్యాల రాజిరెడ్డి కోరారు.
సమావేశంలో అధికార ప్రతినిధి పర్ల పెల్లి రవి, ఉపాధ్యక్షులు వడ్డేపల్లి శంకర్, చల్లూరి సతీష్, ఇందూరు సత్యనారాయణ, జనగామ మల్లేష్, కొండ్ర అంజయ్య, రొడ్డ సంపత్, పల్లె సురేందర్ , మాసాడి సాయి చరణ్, రహమాన్ , పులిపాక శంకర్, మురళీకృష్ణ, దండే రవి, సంతోష్, శ్రీనివాస్ రెడ్డి, సునీల్ ,రవీందర్, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు

# ఎల్లారెడ్డిలో జోరుగా వర్షం



**ఎల్లారెడ్డి జూన్ 24 (జనం సాక్షి)**
కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కనిపించగా, అనంతరం మేఘాలు కమ్ముకుని వర్షం ప్రారంభమైంది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు, వ్యాపార కేంద్రాలు తడిసి ముద్దయ్యాయి. వర్షం కారణంగా వాహనదారులు, పాదచారులు కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉక్కపోత నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. రైతులు కూడా ఈ వర్షాన్ని స్వాగతిస్తూ, ఖరీఫ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# నిత్యాన్నదానానికి భక్తుడి విరాళం

మల్యాల జూన్ 24 (జనం సాక్షి)
తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానంలో జరిగే నిత్యాన్నదానం కోసం బుధవారం కూకట్‌పల్లి చెందిన భక్తుడు రంగ ధ్రువన్ పొన్నాల ఆలయ ఈఓ ఎస్.అంజనారెడ్డికి 1 లక్ష రూ విరాళ చెక్కును అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాన్ని అందజేసి రంగ ధ్రువన్ పొన్నాల దంపతులను ఆశీర్వదించారు. ఆలయ ఈవో అంజనరెడ్డి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెంట్ సునీల్ టెంపుల్ ఇన్స్పెక్టర్ అశోక్ ఉన్నారు.

# ఒకే భవనానికి రెండోసారి భూమిపూజ.. సర్పంచ్ గైర్హాజరు.. అసలు జరుగుతున్నదేమిటి?

**సిరికొండ జూన్ 24 (జనం సాక్షి):**
సిరికొండ మండల కేంద్రంలోని అంగడి బజార్ వద్ద మహిళా సంఘం (వీఓ) భవన నిర్మాణ పనులకు బుధవారం మరోసారి భూమిపూజ నిర్వహించడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఇదే స్థలంలో ఇదే భవన నిర్మాణ పనులకు ఈ నెల 6వ తేదీన ఇప్పటికే ఘనంగా భూమిపూజ నిర్వహించిన విషయం తెలిసిందే. అప్పటి ఎంపీడీఓ మనోహర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మల్లెల సాయిచరణ్, ఏపీఎం సువర్ణ, ఉపసర్పంచ్ గ్యామా శోభన్, వీడీసీ సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధుల సమక్షంలో తొలి భూమిపూజ జరిగింది. అయితే దాదాపు మూడు వారాలు గడిచినా నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో గ్రామస్థుల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో బుధవారం అదే స్థలంలో మరోసారి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన ఎంపీడీఓ మహమ్మద్ రఫీ అహ్మద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వీడీసీ చైర్మన్ దేగం సాయన్న, మండల కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రాము మొట్టల, గ్రామ అధ్యక్షుడు దిగంబర్, మైనారిటీ మండల అధ్యక్షుడు ఆసిఫ్, ఉపసర్పంచ్ శోభన్, వీడీసీ వైస్ చైర్మన్ శివ,


# మహిళా సాధికారతకు మరో ముందడుగు
సిరికొండలో మహిళా సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ
07 Jun 2026 - Page 4
https://epaper.janamsakshi.org/clip/498801

క్యాషియర్ గణేష్ గౌడ్, వార్డు సభ్యులు, ఏఈఓ, మహిళా సంఘం సీసీ రాజేందర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. అయితే గత కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ మల్లెల సాయిచరణ్ ఈసారి గైర్హాజరు కావడం మరిన్ని ప్రశ్నలకు తావిస్తోంది. గ్రామ పంచాయతీ అధినేతగా ఉన్న సర్పంచ్ లేకుండానే భూమిపూజ నిర్వహించడంపై గ్రామంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే పనికి రెండుసార్లు భూమిపూజలు నిర్వహించాల్సిన అవసరం ఏమిటి? మొదటి భూమిపూజ అనంతరం పనులు ఎందుకు ప్రారంభం కాలేదు? రెండో కార్యక్రమానికి సర్పంచ్‌ను ఎందుకు ఆహ్వానించలేదు లేదా ఎందుకు హాజరు కాలేదు? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. "పనులు ప్రారంభించడం ముఖ్యమా.. లేక భూమిపూజలే ముఖ్యమా?", "ఒకే పనికి రెండుసార్లు భూమిపూజలు ఎందుకు?", "గ్రామ ప్రథమ పౌరుడు లేకుండా కార్యక్రమం నిర్వహించడం వెనుక కారణమేంటి?" అంటూ గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టత ఇవ్వాలని గ్రామస్థులు కోరుతున్నారు.



## ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయి

### బి,ఆర్,ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్

**సిరిసిల్ల టౌన్ జూన్ 24 (జనంసాక్షి)**
అధిక పీజుల కారణంగా అనేక మంది విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని బి,ఆర్ఎస్వి నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. బుధవారం సిరిసిల్ల జిల్లా డి,ఇ,ఓ కు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ ప్రైవేటు కార్పొరేటు విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని, నోట్ బుక్, యూనిఫామ్స్, ఇతర విద్య సామాగ్రిని పాఠశాలలోనే విక్రయిస్తూ తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న యాజమాన్యాలపై వెంటనే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టె శ్రీనివాస్, మల్యాల ప్రవీణ్ బైకని వేణు యాదవ్, ఎండి అజ్జు ,శశి, ఎండి సమీర్ , తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**కథలాపూర్ జూన్ 24 (జనం సాక్షి)**


కథలాపూర్ మండల పరిధిలోని తక్కల్లపల్లి గ్రామ శివారులో నుండి అక్రమంగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, ఇసుకను తరలిస్తున్న నెంబర్ టీ ఎస్ 25 టీ 075 గల టిప్పర్ ను పట్టుకొని, అట్టి టిప్పర్ డ్రైవర్ శ్రీకాంత్ మరియు యజమాని మ్యాకల అంజయ్యా లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్సై రవికిరణ్ తెలిపినారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభం

### బి ఎల్ ఏ ఎస్ కార్యక్రమం విజయవంతం చేయండి

**కథలాపూర్ జూన్ 24( జనంసాక్షి)**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్)కార్యక్రమం 25 జూన్ 2026 నుండి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాలు సంబంధిత బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ లు) ద్వారా 25 జూన్ 2026 నుండి 30 జూన్ 2026 వరకు ఇంటింటికీ పంపిణీ చేయబడతాయి.ప్రజలు క్రింది అంశాలను గమనించి సహకరించగలరు:25 జూన్ 2026 నుండి 30 జూన్ 2026 వరకు బి ఎల్ ఓ లు ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారు.ఫారాలు స్వీకరించిన ఓటర్లు వాటిలో కోరిన వివరాలను పూర్తి సమాచారం బి ఎల్ ఓ లకు ఇవ్వగలరని కోరనైనది.ముఖ్యంగా 2002 సంవత్సరంలో నిర్వహించిన ఏస్ ఐ ఆర్ వివరాలను సంబంధిత కాలమ్‌లలో నమోదు చేయాలి. ప్రతి ఎన్యూమరేషన్ ఫారంతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫోటోను తప్పనిసరిగా జతపరచాలి.పూర్తి చేసిన ఫారాలను నిర్ణీత గడువులోగా సంబంధిత ఎ ఎల్ ఓ తమ ఇంటికి వచ్చిన పిదప తిరిగి అందజేయాలి.మండలంలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలు మరియు బూత్ లెవల్ ఏజెంట్లు (బి ఎల్ ఏ ఎస్) ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు బి ఎల్ ఓ లకు పూర్తి సహకారం అందించవలసిందిగా కోరడమైనది. వారి సహకారంతో ఈ కార్యక్రమం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు సజావుగా నిర్వహించబడుతుంది.

## మండల కేంద్రంలో గ్రామ సమైక్య సంఘ భవన భూమి పూజ

**గంభీరావుపేట జూన్ 24 (జనంసాక్షి);**

గంభీరావుపేట మండలకేంద్రంలో గ్రామ సమైక్య సంఘం భవన భూమి పూజ గ్రామ సర్పంచ్ మల్లు గారి పద్మ నరసయ్య గౌడ్ చేతుల మీదుగా నిర్వహించారు. సర్పంచ్ పద్మ మాట్లాడుతూ భవనానికి సహకరించిన రాష్ట్ర వాక్స్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుసేని కృతజ్ఞతలు తెలిపారు, మొదటి విడతగా ఐదు భవనాలకు మంజూరు చేసినందుకు గాను రెండో విడత నాలుగు భవనాలకు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ, మహిళా సంఘాలను బలో పితం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు కార్యక్రమంలో వార్డు సభ్యులు, దేవసాని కృష్ణ, సాదా బేగం, నరేష్, వరలక్ష్మి సీసీలు, బాబు , సురేందర్, మహిళ సంఘ అధ్యక్షులు, సిఏలు, సంఘ సభ్యురాలు పాల్గొన్నారు.



## కళధార హై స్కూల్లో డ్రాగ్స్ పై అవగాహన సదస్సు

**కథలాపూర్ జూన్ 24 (జనంసాక్షి)**
కథలపూర్ మండల కేంద్రంలోని కళదర హైస్కూల్లో స్థానిక ఎస్సై రవికిరణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజాయి మత్తు లాంటి పదార్థాలు తీసుకోవడం వల్ల విద్యార్థులు తమ భవిష్యత్తును కోల్పోతారని అలాగే సైబర్ క్రైమ్ వల్ల కూడా సైబర్ నేరాల వల్ల కూడా విద్యార్థులు అనవసరమైన ఆర్థిక నష్టల గురవుతున్నారని కాబట్టి విద్యార్థులు భవిష్యత్తులో వీటిపై అవగాహన కలిగి మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గడ్డం భూమారెడ్డి ప్రిన్సిపల్ కమలాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయకపోతే ప్రభుత్వంపై ఉద్యమం

### శాతవాహన యూనివర్సిటీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్

కరీంనగర్ టౌన్, జూన్ 24 ( జనం సాక్షి)
శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను తక్షణమే రెగ్యులర్ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వంపై విద్యార్థి ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ హెచ్చరించారు.భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) శాతవాహన యూనివర్సిటీ ముఖ్య నాయకుల సమావేశం యూనివర్సిటీ అధ్యక్షుడు సాయి అధ్యక్షతన నిర్వహించగా, ముఖ్య అతిథిగా కాంపెల్లి అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు విజ్ఞానానికి పునాదులుగా ఉండాల్సిన చోట విద్యార్థులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో రెగ్యులర్ కోర్సులుగా ఉన్న కొన్ని కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చడం వల్ల విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధిక ఫీజులు చెల్లించలేక చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో చదువుతున్న విద్యార్థులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారిపై మరింత భారం మోపడం బాధాకరమని విమర్శించారు.

రాష్ట్ర ప్రభుత్వం శాతవాహన యూనివర్సిటీ పట్ల వివక్ష చూపుతోందని ఆరోపించిన ఆయన, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేసే విషయంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ యథావిధిగా కొనసాగితే ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయకపోతే విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతారని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కార్యదర్శి అనిల్, ఉపాధ్యక్షులు నవీన్, ఓం ప్రకాష్, నాయకులు ప్రశాంత్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు

○భక్తిశ్రద్ధలతో నెత్తిన బోనంతో కదిలిన మహిళలు...

○శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్టను విజయవంతం చేయాలని విజ్ఞప్తి..

**చిగురుమామిడి జూన్ 24(జనంసాక్షి):**
చిగురుమామిడి మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో బుధవారం పోచమ్మ బోనాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.ఈ నెల 27నుండి జులై 2వరకు జరిగే శ్రీ పెద్దమ్మ తల్లి జాతరలో భాగంగా పోచమ్మ తల్లి బోనాలను పెద్ద ఎత్తున నిర్వహించినట్లు ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. ప్రతి గడప నుండి మహిళలు బోనం ఎత్తుకొని డప్పు చప్పులు యువకుల కేరింతలు,పోతరాజుల విన్యాసాలు,శివసత్తుల పూనకాల మధ్య పండగ వాతావరణంలో భారీ ఎత్తున బోనాల ఊరేగింపును నిర్వహించారు.పోతరాజుల విన్యాసాల మధ్య గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి బోనం కుండలో తీసుకువచ్చిన ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని,వర్షాలు సమృద్ధి కురిసి పంటలు బాగా పండాలని,గొడ్డు గోదా బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు.ఈ నేల 29న విగ్రహ ప్రతిష్ట,జులై 1న పెద్దమ్మ తల్లికి బోనాలు,జూలై 2న అమ్మవారికి ఓడి బియ్యం కార్యక్రమంతో శ్రీపెద్దమ్మ తల్లి జాతర ముగుస్తుందని అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం



నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెరుకు సంజీవ్ కుమార్, మాజీజెడ్పిటిసి గీకురు రవీందర్,ఉపాధ్యక్షులు పొగాకుల రమేష్,కార్యదర్శి గూడ సతీష్ కుమార్, సంఘం పెద్దమనిషి చెరుకు చిన్నసమ్మయ్య,మాజీ పెద్దమనిషి పొన్నం వెంకటరాజయ్య,కార్యవర్గ సభ్యులు చెరుకు నర్సయ్య,పొన్నం బాలయ్య, పొగాకుల శ్రీకాంత్,జెట్టి సమ్మయ్య,బొల్లి రాములు, మల్లం సదానందం,ఆలయ కమిటీ సభ్యులు పొగాకుల కనకయ్య,బొల్లి పరుశురాములు,చెరుకు రాజయ్య,పొన్నం సంపత్,పెసరి శ్రీనివాస్,మల్లం సతీష్ కుమార్,మల్లం కుమారస్వామి,బొల్లి రాజయ్య,పొన్నం చిన్న మల్లయ్య,ముద్రవేణి కుమారస్వామి,చెరుకు రమేష్,పొగాకుల సదానందం సంగం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

## తెలంగాణ ఆదర్శ పాఠశాల & కళాశాలలో ఎస్ఐ రామకృష్ణ చైతన్య సందేశం

**సిరికొండ జూన్ 24 (జనంసాక్షి):** సిరికొండ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో బుధవారం స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు. అలాగే ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులను నమ్మవద్దని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ వ్యక్తిగత సమాచారాన్ని భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఎస్ఐ రామకృష్ణ ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ మాదకద్రవ్యాల దుష్పరిణామాలు, సైబర్ మోసాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి, అధ్యాపక బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో చైతన్యం నింపుతూ విజయవంతంగా ముగిసింది.



# ఖని లెక్చరర్ కిరణ్ కు డాక్టరేట్..

**గోదావరిఖని, జనంసాక్షి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి, కామర్స్ గెస్ట్ ఫ్యాకల్టీ వడ్లూరి కిరణ్ కుమార్ కు రాజస్తాన్ లోని జ్యోతి విద్యాపీఠ్ వారు పీ. హెచ్ డీ (డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టాను ప్రదానం చేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సేవలు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందినందుకు ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జై కిషన్ ఓఝా, అధ్యాపక బృందం కిరణ్ కుమార్ ను అభినందించి శాలువాతో సన్మానించారు. ఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి అయిన వి. కిరణ్ కుమార్ అకడమిక్స్ లో పీ. హెచ్ డీ లాంటి ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులకు మరిన్ని మెళుకువలు, నైపుణ్యాలను నేర్పించవచ్చని, అలాగే విద్యార్థులకు పరిశోధన పద్ధతులు నేర్పించవచ్చని ప్రిన్సిపాల్ తన సందేశంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ జి. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



# తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

**మల్యాల జూన్ 24 (జనంసాక్షి)** మల్యాల మండల కేంద్రంలో అంగడి బజార్ సమీపంలో అర్ధరాత్రి సమయంలో తాళం వేసిన కలువాల సత్య ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు 2 తులాల బంగారనీ, 35 తులాల వెండి దొంగిలించారు. సత్య భర్త విదేశాలకు వెళ్లగా కొడుకు తో కలిసి కరీంనగర్లో నివసిస్తున్నది. ఇంటి వెనకాల ఇంటిలో ఆమె తల్లి పోచంపల్లి బుచ్చవ్వ బుధవారం ఉదయం 7 గంటల సమయం లో చూసేసరికి తలుపు తెరిచి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఫింగర్ ప్రింట్స్ ఆధారాలు సేకరించారు. కలువాల సత్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.





## నీట్ బాధితులకు సంఘీభావంగా

# కొవ్వొత్తుల ర్యాలీ

**కామారెడ్డి ప్రతినిధి, జూన్ 24 (జనంసాక్షి)** నీట్ పేపర్ లీకేజ్ ఘటనలతో దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళన నేపథ్యంలో, బాధిత విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలకు కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ నాయకత్వం వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన చాత్రోన్ కీ గూంజ్" కార్యక్రమానికి మద్దతుగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీని ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీలో కామారెడ్డి చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి పట్టణ టౌన్ ప్రెసిడెంట్ ఐరేని సందీప్ కుమార్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ అజీమ్ లాలా, ఎస్సీ, ఎస్టీ, సెల్ అధ్యక్షులు, వివిధ మండలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, డిసిసి కార్యవర్గ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు, విద్యార్థి యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కొవ్వొత్తులు వెలిగించి నీట్ పేపర్ లీకేజ్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ఘటనలు దేశంలో పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కామారెడ్డి పట్టణంలో కొవ్వొత్తుల వెలుగులతో సాగిన ఈ ర్యాలీ ప్రజల్లో విశేష స్పందనను రేకెత్తించగా, విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పోరాడుతోందనే సందేశాన్ని బలంగా చాటిందని పలువురు అభిప్రాయపడ్డారు.



# గోదావరిఖని-కాకినాడ ఆర్టీసీ బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్..

**గోదావరిఖని, జనంసాక్షి :** ప్రజల రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపర్చే దిశగా గోదావరిఖని నుండి కాకినాడకు నూతన ఆర్టీసీ బస్సు సేవను బుధవారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. బస్సుకు పూజలు నిర్వహించి, జెండా ఊపి ఆయన సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ గోదావరిఖని, పరిసర ప్రాంతాల ప్రజలకు కాకినాడకు ప్రయాణించేందుకు ఈ కొత్త బస్సు సేవ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని రవాణా సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు. కొత్త బస్సు సేవ ప్రారంభం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



# ఎండాకాలంలో విద్యార్థులకు ఉపశమనం..

- విద్యార్థుల దాహార్తి తీర్చేందుకు వాటర్ ఫ్రిజ్ అందించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్
- రామగుండం మహిళా గురుకుల కళాశాలలో విద్యార్థుల సౌకర్యాల కోసం మరో అడుగు..

**అంతర్గాం, జనంసాక్షి :** విద్యార్థుల సంక్షేమం, సౌకర్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. రామగుండం మహిళా గురుకుల కళాశాలలో విద్యార్థులకు చల్లని తాగునీరు అందించాలనే ఉద్దేశంతో వాటర్ ఫ్రిజ్‌ను అందజేసి విద్యార్థుల దాహార్తిని తీర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కళాశాలలో వాటర్ ఫ్రిజ్ అవసరమని గురుకుల పేరెంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కవ్వంపల్లి సతీష్, కళాశాల ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ నాయకులు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీల దృష్టికి తీసుకెళ్లారు. వారి విజ్ఞప్తికి వెంటనే స్పందించిన ప్రజాప్రతినిధులు రామగుండం కార్పొరేషన్ ద్వారా కళాశాలకు వాటర్ ఫ్రిజ్‌ను మంజూరు చేశారు. ఈ వాటర్ ఫ్రిజ్‌ను బుధవారం కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ తేజస్వీని, ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, గురుకుల పేరెంట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కవ్వంపల్లి సతీష్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ విద్యార్థుల సంక్షేమం కోసం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారని కొనియాడారు. కళాశాల అభివృద్ధి కోసం ఇప్పటికే మిషన్ భగీరథ ద్వారా తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయడం, కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచే చర్యలు చేపట్టడం, రహదారి సౌకర్యం కల్పించడం, కుట్టు మిషన్లను అందించడం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. విద్యార్థులకు ఎండాకాలంలో చల్లని నీరు అందించాలనే తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని కార్పొరేషన్ ద్వారా వాటర్ ఫ్రిజ్‌ను అందించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుండే ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్, మేయర్ మహంకాళి స్వామి, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టెండర్ ప్రక్రియ పూర్తికాకముందే విద్యార్థుల అవసరాన్ని గుర్తించి వాటర్ ఫ్రిజ్ ఏర్పాటు చేయడంలో సహకరించిన కార్పొరేషన్ ఈఈ తేజస్విని, కాంట్రాక్టర్లు రాజేష్, విక్రమ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ఎస్‌వీపీ రజిత, జేవీపీ రజిత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ దుర్గం ఉషారాణి మురళి, వైస్ చైర్మన్ మాధవి, ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి, కోశాధికారి అంజలి, నాయకులు కన్నం సంపత్, శైలజ, సంధ్యారాణి, రజిత, జ్యోతి, నవీన, కళ్యాణి, ప్రియాంకలతో పాటు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## వర్షాకాలంలో పరిశుభ్రత పాటించని హోటల్ రెస్టారెంట్లపై కఠిన చర్యలు

### తనిఖీలు పలు లోపాలు గుర్తించిన ఆహార భద్రత అధికారి

**కామారెడ్డి ప్రతినిధి జూన్ 24 (జనంసాక్షి)**
బాన్సువాడ పలు హోటళ్లు, రిటైల్ దుకాణాల్లో ఆహార భద్రత అధికారి జి. విక్రమ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో వండిన ఆహారాన్ని రిఫ్రిజిరేటర్‌లో అపరిశుభ్రంగా నిల్వ చేయడం, ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులు వాడటం గుర్తించి నిర్వాహకులను ఆహార భద్రత అధికారి తీవ్రంగా హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది వ్యక్తిగత శుభ్రత లోపించింది. అనుమానిత ఆహార నమూనాలను సేకరించి పరీక్ష నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాల, హైదరాబాద్‌కు పంపించారు. ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా ఈఖూా చట్టం-2006 ప్రకారం చర్యలు తీసుకుంటారు.
హోటళ్లు, దుకాణాల యజమానులు పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది శుభ్రత పాటించాలని, రిటైల్ వ్యాపారులు ఈఖూాంఎ లేబులింగ్ నిబంధనలు తప్పక పాటించాలని ఆహార భద్రత అధికారి ఆదేశించారు.



### తిప్పాపూర్ లోబాల గ్రామసభ విద్యార్థులకు అవగాహన

**భిక్కనూరు జూన్ 24 (జనంసాక్షి):**
భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం బాల గ్రామసభ గ్రామపంచాయతీ అభివృద్ధి పనులలో భాగంగా ఏర్పాటు చేసిన సభకు సర్పంచ్ కుంట లింగారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశంలో గ్రామ పంచాయతీ స్థాయిలో పిల్లల హక్కులు వారి సమస్యలు, మరియు సంక్షేమం గురించి చర్చించడానికి ఏర్పాటు చేయబడిన ప్రత్యేక వేదిక,గ్రామ అభివృద్ధి ప్రణాళికలలో పిల్లల భాగస్వామ్యాన్ని పెంచడం మరియు వారి గొంతును స్థానిక ప్రభుత్వానికి వినిపించడం దీని ముఖ్య ఉద్దేశం,బాలలకు సంబంధించిన శుభ్రత ఆరోగ్యం,త్రాగునీరు పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం నాణ్యత,బడి బయట ఉన్న పిల్లలను తిరిగి బడిలో చేర్పించడం,బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టడం,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,బాలికల రక్షణ మరియు వారికి సురక్షితమైన వాతావరణం కల్పించడం,గ్రామంలో పిల్లలు ఆడుకోవడానికి సురక్షితమైన ఆటస్థలాలు పార్కుల ఏర్పాటు చేయడం, గ్రంథాలయం స్థాపించడం ముఖ్యమైన అంశాలు వంటివి చర్చించడం జరిగింది,గ్రామ అభివృద్ధి ప్రణాళికలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించాలని చర్చించి నిర్ణయించారు, ఈక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి,ఉపాధ్యాయులు, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్,ఉపసర్పంచ్ జీవన్,వార్డు సభ్యులు రజనీకాంత్,గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ ప్రజలు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ కు ఘన నివాళి

**పిట్లం జూన్ 24(జనం సాక్షి)**



పిట్లం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో హెడ్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న రాజకుమార్ మంగళ వారం రోజున తన విధులకు హాజరు అయి నిమిత్తం మద్నూర్ నుండి తన మోటార్ సైకిల్ పై పోలీస్ స్టేషన్ కి వస్తుండగా పెద్ద కొడపుగల్ ప్రాంతంలోని 161 జాతీయ రహదారిపై బ్రిడ్జి వద్ద అజాగ్రత్తగా పార్కింగ్ చేసి ఉంచిన లారీని వెనుక వైపు నుండి ఢీకొనడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. బుధవారం రోజున ఎడపల్లి లో ఆయన అంత్యక్రియలు నిర్వహించబడ్డాయి. ఇట్టి అంత్యక్రియలకు పిట్లం ఎస్ఐ ఆంజనేయులు మరియు స్టేషన్ సిబ్బంది, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు షకీల్ పాషా మరియు వివిధ పోలీస్ స్టేషన్ లకు చెందిన పోలీస్ సిబ్బంది 1998 బ్యాచ్ మెంట్స్ హాజరై హెడ్ కానిస్టేబుల్ రాజ్ కుమార్ కు ఘనంగా నివాళులర్పించారు.

## రేపటి నుండి ఇంటింటి ఓటర్ సర్వే ప్రారంభం..




**గంభీరావుపేట జూన్ 24 (జనం సాక్షి);**
రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నేటి నుండి నుంచి వచ్చేనెల 24వ తేదీ వరకు జరగబోయే ఇంటింటి ఓటర్ సర్వేలో ఓటు హక్కు కలిగిన ప్రతి కుటుంబంలో ప్రతి ఒక్కరికి ఫోటో, మరియు వివరాలు బి ఎల్ ఓ లకు అందించాలని తాసిల్దార్ మారుతి రెడ్డి కోరారు, అర్హులైన ఏ ఒక్కరి ఓటు తీసేయబడదు ఇది కేవలం అనర్హుల ఓట్లు తొలగించడం అనే విషయంపై విచారణ జరుపుతున్నామని తెలిపారు, 1987 కు ముందు జన్మించిన వారు వారి పుట్టింటి రూఫ్ ఏదో ఒకటి చూపించాలని, 2004 కూడా చూపించాల్సి ఉంటుందని తెలిపారు ఈ విషయాలపై మండల ప్రజలు మీ ఇంటింటి సర్వే వచ్చినప్పుడు వివో లకు పూర్తి వివరాలు చెప్పాలని తహశీల్దార్ కోరారు.

### కాలనీలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్..



**గోదావరిఖని, జనంసాక్షి:**
8వ కాలనీలో బిజెపి ఆధ్వర్యంలో డాక్టర్ శామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 8వ కాలనీ లోని బి ఎం ఎస్ కార్యాలయం లో శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నాయకులు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి ఎస్సీ మోర్చా మాజీ రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ డాక్టర్ సమప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత కోసం, జాతి సమగ్రత త కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులని కొనియాడారు. స్వాతంత్ర అనంతరం కాశ్మీర్ అసెంబ్లీలో షేక్ అబ్దుల్లా ముఖ్యమంత్రిత్వంలో కాశ్మీర్ తో ప్రత్యేక ప్రతిపత్తి కావాలని ప్రత్యేక ప్రధానమంత్రి, ప్రత్యేక జెండా, ప్రత్యేక విధానాలు కావాలని అసెంబ్లీలో తీర్మానాలు చేస్తే ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ అమెండ్మెంట్ పై సంతకాలు చేశారని. దానికి నిరసనగా ఒక నిమిషం చలో కాశ్మీర్ పేరుమీద కాశ్మీర్ వరకు రైల్లో ప్రయాణం చేస్తుండగా మే 21,1953 సంవత్సరంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ ని అదుపులోకి తీసుకున్న కాశ్మీర్ ప్రభుత్వం జూన్ 23 1953 వ తేదీన మరణించాడు అని ప్రకటించింది. దేశ సమైక్యత కోసం బలిదానం చేసిన దినంగా" బలిదాన్ దివాస్" గా అప్పటినుండి బిజెపి నిర్వహిస్తుందని తెలిపారు. బిజెపి నాయకులు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో బిజెపి నాయకులు మహావాది రామన్న, మారేపెల్లి శ్రీనివాస్, వసంత లక్ష్మి, పానుగంటి అంజలి, తదుతరులు పాల్గొన్నారు.



### మత్తు పదార్థాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమం

#### ఎఎఎ టౌన్ సీఐ ఆధ్వర్యంలో తనిఖీలు, పోటీలు నిర్వహణ

**కరీంనగర్ టౌన్, జూన్ 24, (జనంసాక్షి)**
అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం?2026 సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎఎఎ టౌన్ సీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కోటిక్ డిటెక్షన్ డాగ్స్ సహాయంతో బాలుర హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అలాగే విద్యార్థుల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు లక్ష్ స్కూల్‌లో యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్లోగన్ రైటింగ్, పోస్టర్ మేకింగ్, రంగవల్లి (రంగోలి) వంటి పోటీలను నిర్వహించి విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని అధికారులు సూచించారు. సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎఎఎ టౌన్ సీఐ పిలుపునిచ్చారు.

### ఆర్ జె డి కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

**జమ్మికుంట, జూన్24 (జనం సాక్షి):**
తెలంగాణ రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ కాటిపల్లి సత్యనారాయణ రెడ్డి మాతృమూర్తి తిరుపతమ్మ ఇటీవల తన స్వగ్రామమైన కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామంలో మరణించగా బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, ఎస్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు సదానందం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గజ్జి ఐలయ్య, మాదారపు రత్నాకర్ గౌడ్ లు మాచనపల్లి గ్రామానికి వెళ్లి కాటిపల్లి తిరుపతమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించి సత్యనారాయణ రెడ్డిని కుటుంబ సభ్యులను పరామర్శించారు.



## నేటి నుండి బిఎల్వోలు ఇంటింటి పర్యటన..



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 24 (జనంసాక్షి):** నేటి నుండి వేములవాడ అర్బన్ మండల పరిధిలో ఇంటింటికి బిఎల్వోలు పర్యటిస్తారని తాసిల్దార్ జయంత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ అర్బన్ మండలంలో నేటి నుండి వారం రోజులపాటు బిఎల్ఓలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వచ్చి ఎన్యుమరేషన్ ఫామ్స్ ఆ ఇంటిలో ఉన్న ఓటర్లందరికి అందజేస్తారన్నారు. ప్రతి కుటుంబంలో ఓటు హక్కు కలిగినవారు అట్టి దరఖాస్తు ఫామ్ ను నింపి దానికిప్రతి ఒక్కరు పాస్పోర్ట్ సైజు ఫోటోను ఎన్యూమరేషన్ ఫారానికి అతికించి బిఎల్ఓకు వచ్చేనెల 24 వరకు అందజేయాలన్నారు. రాష్ట్రంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో అర్హులైన ఏ ఒక్కరీ ఓటు తీసివేయబడదన్నారు. కేవలం అనర్హుల ఓట్ల అనగా ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లగా వారికి ఉన్న రెండు ఓట్లలో ఒకటి, చనిపోయిన వారి పేర్లు, ఓటర్ కార్డులో డబుల్ పేర్లు ఉన్న వారి ఓట్లు మాత్రమే తొలగించడం జరుగుతుందన్నారు. అర్హులైన ఓటర్లు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సిన అవసరం లేదన్నారు. 1.7.1987 కి ముందు జన్మించిన వారికి ఎన్నికల కమిషన్ పెట్టిన నిబంధనల మేరకు 11 రకాలలో ఏదో ఒక రకమైన ఒరిజినల్ ఐడి కార్డు బిఎల్ఓ కు చూపించాల్సి ఉంటుందన్నారు. 1.7.1987 నుండి 2.12.2004 మధ్యలో జన్మించిన వారు వారి ధ్రువీకరణ పత్రంతో పాటు వారి యొక్క తల్లిదండ్రుల ఐడి ప్రూఫ్ చూపించాల్సి ఉంటుందన్నారు. 2.12.2004 తర్వాత జన్మించిన వారు వారి ఐడి ప్రూఫ్ తో పాటు వారి తల్లి తండ్రుల ప్రూఫ్ కూడా చూపించాల్సి ఉంటుందని ప్రతి ఒక ఓటర్ ఇది గమనించాల న్నరు. కుటుంబంలో ఉండే ప్రతి యొక్క ఓటరు తమ పాస్పోర్ట్ సైజ్ ఫోటోను తమ వద్ద అందుబాటులో ఉంచుకోవాలని అయన తెలిపారు.



## రాజారెడ్డి జనసేన ట్రస్టు ద్వారా పాఠశాలకు బెంచీలు డెస్కులు..పంపిణీ

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 24 (జనం సాక్షి)**
కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఏర్పాటుచేసిన కె ఆర్ ట్రస్ట్ ద్వారా మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రా గ్రామంలో గల ఎంపీపీ ఎస్ పాఠశాలకు బెంచీలతో పాటు డిస్కు పంపిణీ చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి తన తండ్రి పేరు మీద ఏర్పాటు చేసిన ట్రస్టు ద్వారా పేద విద్యార్థుల కొరకు బెంచీలు డెస్కు మా పాఠశాలకు పంపినందుకు ఎమ్మెల్యే కె.వి.ఆర్ కు పాఠశాల తరఫున గ్రామస్తుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా మని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కేపీ.. రాజారెడ్డి జనసేవ ట్రస్ట్ ద్వారా 1-5 తరగతులకు డెస్క్ లు (62)బెంచి లు పంపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, శ్రీనివాస్, కీర్తన, రజిత పాల్గొన్నారు.



## కేశవపట్నం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన అడిషనల్ డీసీపీ

**శంకరపట్నం జూన్ 24 జనంసాక్షి**
పోలీస్ శాఖలో పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) వెంకటరమణ బుధవారం కేశవపట్నం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసులకు సంబంధించిన ఫైళ్లు, నిర్వహణ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో పాటించాల్సిన ప్రమాణాలు, పెండింగ్ అంశాల పరిష్కారం, కార్యాలయ నిర్వహణలో అనుసరించాల్సిన విధానాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే పోలీస్ శాఖలో కీలకమైన సీసీటీఎన్ఎస్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ సిస్టం) వ్యవస్థ పనితీరును సమీక్షించి, డేటా నమోదు, కేసుల అప్‌డేట్లు, సాంకేతిక వినియోగంపై అవసరమైన మార్గదర్శకాలను అందించారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమైన వెంకటరమణ, రాష్ట్ర డీజీపీ ఆదేశాలను వివరించారు. ప్రజలతో మరింత స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసుల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని, ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెంపొందించే విధంగా విధులు నిర్వర్తించాలని ఆయన పేర్కొన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్, హుజురాబాద్ ఏసీపీ మాధవి, కేశవపట్నం ఎస్ఐ కే. శేఖర్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. అధికారులు చేసిన సూచనలను అమలు చేసి పోలీస్ సేవలను మరింత మెరుగుపర్చేందుకు కృషి చేస్తామని సిబ్బంది తెలిపారు.



## వరద కాలువ పూడిక పనులు ప్రారంభించిన కామారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్





**కామారెడ్డి ప్రతినిధిజూన్ 24 (జనంసాక్షి)**
గత సంవత్సరం కురిసిన భారీ వర్షాల కారణంగా కాలనీలో వరద ఉధృతి పెరిగి, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఆ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది ముందస్తు చర్యగా పూడుకుపోయిన వరద కాల్వను జేసీబీ (ఏఅః) యంత్రాల సహాయంతో క్లీన్ చేయిస్తున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ. రాబోయే వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ తరపున అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కాలనీల్లో డ్రైనేజీ, వరద నీరు సజావుగా సాగిపోయేలా చర్యలు చేపడుతున్నాం. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, మహేష్, భాను, అంజాద్, అన్వర్, గణేష్, సత్యం, అధికారులు డి ఈ హనుమంతరావు, ఏఈ వేణు తదితులు పాల్గొన్నారు.

## ముధిమాణిక్యం రైతువేదికలో విత్తన మేళా నిర్వహణ..

**ప్రభుత్వం ప్రతిపాదించిన ఏడు సన్న రకాలకే బోనస్..**

**వ్యవసాయ అధికారి పున్నం చందర్ రెడ్డి..**



**చిగురుమామిడి జూన్ 24 (జనంసాక్షి):**
కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామంలో ప్రభుత్వం ప్రతిపాదించిన బోనస్ కలిగిన ఫైన్ వరి వంగడాల ప్రోత్సాహంలో భాగంగా ముధిమాణిక్యం గ్రామ రైతువేదికలో విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పున్నం చందర్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న 'ఏడు రకాల' బోనస్ పథకం,ఫైన్ వరి వంగడాల ప్రత్యేకతలు,అధిక దిగుబడులు సాధించే సాగువిధానాలపై వివరించారు.గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని ప్రభుత్వ సూచనల మేరకు సాగు చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారి అకుల ప్రణయ్ రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు,విత్తనాల ఎంపిక, సరైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు సందేహాలను నివృత్తి చేసుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సంకల్పించారు.



## విత్తనాలు, ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి వినోద్

**పిట్లం జూన్ 24(జనంసాక్షి)**
పిట్లం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలపై మండల వ్యవసాయ అధికారి వినోద్ ఆకస్మిక తనిఖీ చేసి లైసెన్స్, సీడ్, పెస్టిసైడ్ మరియు ఫర్టిలైజర్ స్టాక్ రిజిస్టర్ నిల్వలు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణ దారులా యాజమానులు ప్రతిరోజు స్టాక్ వివరాలు సూచిక బోర్డులో పొందుపరచాలి అని అన్నారు. విత్తనాలు మరియు ఎరువులు గరిష్ట ధర కంటే ఎక్కువగా అమ్మ రాదు అన్నారు. విత్తనాలు మరియు ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ పూర్తిగా రద్దు చేస్తామని హెచ్చరించారు. కొనుగోలుదారుడికి కచ్చితంగా రసీదు ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి వినోద్ సూచించారు.



## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**పిట్లం జూన్ 24(జనం సాక్షి)**
పిట్లం మండల కేంద్రంలోని వివేకానంద విద్యానికేతన్ పాఠశాలల్లో జిల్లా రవాణా అధికారి టి సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు విద్యార్థులకు రోడ్డు భద్రతపై పాఠశాల ఇంచార్జ్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయక మోటర్ వాహనాల తనిఖీ అధికారులు రఫీ, కృష్ణ తేజ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే రోడ్డు నియమాల పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలి. మరియు కారులో వెళ్లేటప్పుడు సీటు బెల్టు పెట్టుకునేలా గుర్తు చేస్తూ మార్పు తీసుకురావాలని అన్నారు. అదేవిధంగా పాఠశాల బస్సులో ప్రయాణించేటప్పుడు విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత ్తలను అత్యవసర సమయాలలో ప్రవర్తించవలసిన తీరును వారు ప్రాక్టికల్ గా వివరించారు. నిబంధనలను పాటించడం ద్వారానే ప్రమాదాలను అరికట్టవచ్చని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్..!



**గన్నేరువరం, జూన్ 24 (జనంసాక్షి):**
ప్రజా ప్రభుత్వంలోనే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నామని గన్నేరువరం గ్రామ సర్పంచ్ రంగనవేణి లచ్చినర్సు అన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా మండల కేంద్రంలోని రంగనవేణి కవిత - ఐలయ్య కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బుధవారం సర్పంచ్ లచ్చినర్సు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ తోకలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో నిరుపేదైలన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూస్తానని ఇల్లు లేని కుటుంబం ఏ ఒక్కరు ఉండదని గ్రామాన్ని అభివృద్ధి చేయాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు, సామాన్యుడిని అభివృద్ధి చేయడమై నా లక్ష్యమని ఏ సమస్యలు ఉన్న నేరుగా నా దృష్టికి తీసుకురావాలని సర్పంచి రంగనవేణి లచ్చి నర్సు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సునీల్ మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతో మంజూరు చేయిస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసినందుకు మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్.కవ్వంపల్లి సత్యనారాయణ కి లబ్ధిదారులు కవిత ఐలయ్య దంపతులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు చింతల శ్రీధర్ రెడ్డి, వార్డ్ సభ్యులు బోయిని కుమార్, వేదిరే విజేందర్, సతీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాత జీవన్, దేశరాజు అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాలపై కఠిన చర్యలు

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి,జూన్ 24(జనంసాక్షి) :**



ప్రభుత్వ భూముల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ పట్టాలు, భూ అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు కొనసాగిస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముత్తారం మండలంలోని పోతారం, మైదంబండ గ్రామాల్లో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలపై సమగ్ర విచారణ నిర్వహించినట్లు తెలిపారు.విచారణలో భాగంగా రెవెన్యూ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత అధికారుల నివేదికలు, అందుబాటులో ఉన్న ఆధారాలను పరిశీలించగా పోతారం గ్రామంలోని సర్వే నెం.59లో 19 ఎకరాలు 01 గుంటల భూమి, మైదంబండ గ్రామంలోని సర్వే నెం.113లో 11 ఎకరాలు 02 గుంటల భూమి ప్రభుత్వ భూములుగా నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు.సంబంధిత వ్యక్తులు సదరు భూములను ఎప్పుడూ సాగు చేయలేదని, భూములు వారి భౌతిక స్వాధీనంలో కూడా లేవని విచారణలో తేలిన నేపథ్యంలో ప్రభుత్వ భూములపై అక్రమంగా సృష్టించబడిన పట్టాలను రద్దు చేసినట్లు తెలిపారు.తదనుగుణంగా సంబంధిత భూములను తిరిగి ప్రభుత్వ స్వాధీనంలోకి తీసుకుని నోషనల్ ఖాతాలో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆక్రమణల తొలగింపు ప్రక్రియను పూర్తి చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న వ్యక్తులపై, ప్రభుత్వ భూములపై అక్రమ హక్కులు పొందేందుకు సహకరించిన మిషన్ భగీరథ మంథని సబ్ డివిజన్ హెల్పర్ గుజ్జుల శ్రీధర్ , మంథని ముత్తారం ఎంపిడిఓ కార్యాలయ డేటా ఎంట్రీ ఆపరేటర్ పాదాల సతీష్, ముత్తారం నరేగా ఫీల్డ్ అసిస్టెంట్ ధూమల శ్రవణ్ వారిపై, అలాగే ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై సంబంధిత చట్టాలు, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు చేపట్టేందుకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

# వాస్కులర్ వ్యాధులపై ముందు జాగ్రత్తలు తీసుకుంటేే మంచిది

## యశోద హాస్పిటల్ సీనియర్ సర్జన్ డాక్టర్ డి .ప్రభాకర్

**పెద్దపల్లి,జూన్ 24(జనంసాక్షి)**



కాళ్ల నొప్పులు కేవలం మోకాళ్ల నొప్పులు లేదా నరాల బలహీనత అని భావించి నిర్లక్ష్యం చేయడం ప్రాణాపాయానికి దారితీయవచ్చునని,కాళ్లకు రక్త ప్రసరణ తగ్గే వాస్కులర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సికింద్రాబాద్ బ్రాంచి యశోద హాస్పిటల్ సీనియర్ వాస్కులర్ సర్జన్ డాక్టర్ ప్రభాకర్ ప్రజలకు పలు సూచనలు చేశారు...బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాస్కులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన యాంపుటేషన్ ఫ్రీ ఇండియా ప్రచారంలో భాగంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఛాతీ నొప్పిని గుండె సమస్యగా ఎలాగైతే గుర్తిస్తారో, అలాగే కాళ్లలో తీవ్రమైన నొప్పి, నడిచినప్పుడు కాళ్లు బిగుతుగా మారడం, చర్మం రంగు మారడం,కాళ్ల వాపులు లేదా వేళ్లు నల్లబడటం వంటి లక్షణాలు కనిపిస్తే అది రక్తనాళాల సమస్య కావచ్చుని గుర్తుంచుకోవాలి.ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన వారు,ధూమపానం చేసేవారు,మద్యం అలవాటు ఉన్నవారు, అధిక రక్తపోటు,కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నవారు మరియు ఎక్కువ సేపు కదలకుండా కూర్చుని పనిచేసే వారు వాస్కులర్ వ్యాధుల బారిన పడే అవకాశం ఎక్కువని ఆయన వివరించారు. ఎక్కువ నడవడం వలన కూడా నొప్పి రావచ్చు అన్నారు.వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే 80 నుండి 90 శాతం వరకు మందుల ద్వారానే నయం చేయవచ్చు.ప్రజలు ఏదైనా సమస్య ఉన్నప్పుడు స్థానిక వైద్యులను సంప్రదించి,పరిస్థితి తీవ్రతను బట్టి వెంటనే వాస్కులర్ నిపుణులను సంప్రదించాలని కోరారు.పెద్దపల్లి జిల్లాలోని రోగుల కోసం యశోద హాస్పిటల్‌లో ప్రత్యేక అపాయింట్‌మెంట్ సౌకర్యం అందుబాటులో ఉందని,ఈ అవగాహన సదస్సు ద్వారా జిల్లాలో యాంపుటేషన్ రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యమని డాక్టర్ ప్రభాకర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డాక్టర్ ప్రభాకర్ తోపాటు యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ సిబ్బంది లక్ష్మణ్ లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఏఐ, డిజిటల్ లెర్నింగ్ పై శిక్షణ

**గంభీరావుపేట జూన్ 24 (జనం సాక్షి);**

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాల గంభీరావుపేటలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి విజయలక్ష్మి అధ్యక్షతన నోడల్ ఆఫీసర్లు డాక్టర్ జె శ్రవణ్ కుమార్, డాక్టర్ అదివిష్ణు, మహేష్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నా అన్న అక్క మెంటర్షిప్ టీచింగ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇది చాలా చక్కని కార్యక్రమం అని, అధ్యాపకులు ఇచ్చేటువంటి ట్రైనింగ్ ను సద్వినియోగం చేసుకొని మీకు కేటాయించబడినటువంటి స్కూలుకు వెళ్లి 30 క్లాసెస్ను కంప్లీట్ చేసుకుని రెండు క్రెడిట్స్ ను పొందాలని కోరారు. ఈ మెంటర్ షిప్ లో భాగంగా విద్యార్థులు భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు.కళాశాల నోడల్ ఆఫీసర్లు విద్యార్థులతోని తెలంగాణా కోడ్ మిత్ర పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేయించి ఇంటర్న్‌షిప్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రభాకర్, డాక్టర్ వై ఆంజనేయులు పాక ధర్మపురి వి వాణి, డాక్టర్ కె వి బిక్షమయ్య, మనోహర్ శ్రీనివాస్,సుచరణ్,కృష్ణ ప్రసాద్,శంకర్ దీపిక భార్గవి పాల్గొన్నారు.





# కోరుట్ల పట్టణంలోని శ్రీ దుర్గాదేవి దేవాలయంలో ఘనంగా చతుర్థ వార్షికోత్సవం

**కోరుట్ల జగిత్యాల జిల్లా జూన్ 24(జనంసాక్షి) :**

పట్టణంలోని శ్రీ దుర్గాదేవి మందిరం (కాలేజ్ గ్రౌండ్) చతుర్థ వార్షికోత్సవం పట్టణ పురోహితులు పాలెపు రామకృష్ణ శర్మ వైదిక నిర్వహణలో ఘనంగా జరుపుకోవడం జరిగింది..ఈరోజు ఉదయం 8:30 నుండి పూజా కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకం,గణపతి పూజ,పుణ్యా వచనం,నవగ్రహ కలశ స్థాపన
చండీ హోమం పూర్ణాహుతి నిర్వహించి మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది,అన్నప్రసాద కార్యక్రమాన్ని పిల్లల వైద్యులు మిట్టపెల్లి రాజేష్– శ్రీలక్ష్మి ప్రారంభించారు..లఅనంతరం మహిళలు లలిత సహస్ర పారాయణం ఘనంగా నిర్వహించారు...దేవాలయ చతుర్థ వార్షికోత్సవ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ చెర్ పర్సన్ తిరుమల వసంత– గంగాదర్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవీన్ కుమార్ ,మున్సిపల్ ఆఇ అరుణకుమార్,వైద్యులు రేగొండ రాజేష్, ఆర్యవైశ్య రాష్ట్రా నాయకులు బచ్చు శ్రీనివాస్, బీఆర్ ఎస్ నాయకులు ఎలుగూరి కిరణ్ ,దేవాలయ నిర్వాహకులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్,తదితరులు పాల్గొన్నారు.

# డీఈఓకు సమగ్ర నివేదిక అందజేసిన బీఆర్ఎస్వీ

## ప్రైవేట్ పాఠశాలల దోపిడీపై రెండు రోజుల్లో చర్యలు తీసుకోవాలని డిమాండ్

**కరీంనగర్ టౌన్, జూన్ 24 ( జనం సాక్షి)**

కరీంనగర్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యను సేవా దృక్పథంతో కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నాయని బీఆర్ఎస్వీ నాయకులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల అక్రమాలపై సమగ్ర నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు అందజేసినట్లు కరీంనగర్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ తెలిపారు.గతంలో డీఈఓను కలిసి ప్రైవేట్ పాఠశాలల దోపిడీకి సంబంధించిన పూర్తి వివరాలను అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో, బుధవారం బీఆర్ఎస్వీ నాయకులు డీఈఓను కలిసి అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్న పాఠశాలలు, పుస్తక గోదాములు, నిల్వ కేంద్రాల వివరాలతో కూడిన నివేదికను సమర్పించారు.ఈ సందర్భంగా అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై నిర్వహించిన కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీని ప్రజల ముందుకు తీసుకువచ్చామని తెలిపారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మెరుగైన వసతులు ఉండేవని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలహీనపడటంతో



ప్రజలు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గుచూపే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు, పుస్తకాల విక్రయాల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు.కొంతమంది అధికారులు కూడా పాఠశాల యాజమాన్యాలకు పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే సమాచారం తమ వద్ద ఉందని పేర్కొన్నారు. పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు రోజుల్లోగా విద్యాశాఖ తగిన చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల పుస్తక గోదాములను శాంతియుతంగా ముట్టడిస్తామని హెచ్చరించారు. అలాగే సోషల్ మీడియా ద్వారా కూడా ఈ అంశంపై నిరంతరం నిజాలను ప్రజలకు తెలియజేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ ద్యావ మధుసూదన్ రెడ్డి, శాతవాహన యూనివర్సిటీ ఇన్‌చార్జ్ చుక్క శ్రీనివాస్, నగర అధ్యక్షుడు బొంకూరి మోహన్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు గంగాధర చందు, పటేల్ శ్రవణ్ రెడ్డి, సోమిరెడ్డి రాజా నరేష్ రెడ్డి, వడ్లకొండ పరుశరామ్, విక్రమ్, అన్వేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ తల్లి మహోత్సవం లో పాల్గొన్న - ఎమ్మెల్యే విజయ రమణారావు

ఎలిగేడు,జూన్ 24(జనంసాక్షి) :

మండలంలోని లాలపల్లి గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించగా, ఎమ్మెల్లే విజయ రమణా రావు పాల్గొని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో ,సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం గౌడ సంఘం నాయకులు ప్రభుత్వ విప్ ,ఎమ్మెల్యే విజయ రమణా రావు కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమములో మండల అధ్యక్షులు సామ రాజేశ్వర రెడ్డి,పలు గ్రామల సర్పంచులు,గౌడ సంఘం నాయకులు,గౌడ కలస్తులు,కాంగ్రేస్ పార్టీ నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# 99 రోజుల కార్యక్రమం విజయాలను ఆకర్షణీయమైన పుస్తకంగా రూపొందించాలి

- రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్
- ప్రజల వినతులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ అంశాలను డాక్యుమెంట్ చేయాలి
- జిల్లా విజయగాథలు, వినూత్న కార్యక్రమాలు ప్రత్యేకంగా నమోదు చేయాలి
- ఇతర జిల్లాలు అనుసరించదగిన ఉత్తమ విధానాలను పుస్తకంలో పొందుపరచాలి
- గ్రామాల్లో తాగునీరు, అంగన్‌వాడీ భవనాలు, రహదారుల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి
- 99 రోజుల కార్యక్రమంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన రెవెన్యూ శాఖ కార్యదర్శి



**పెద్దపల్లి,జూన్ 24(జనంసాక్షి) :** ప్రతి శాఖ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా నిర్దేశించుకుని, 99 రోజుల కార్యక్రమం ద్వారా సాధించిన విజయాలను ఆకర్షణీయమైన పుస్తకంగా రూపొందించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పెద్దపల్లి జిల్లాలో 99 రోజుల కార్యక్రమం అమలుపై రెవెన్యూ శాఖ కార్యదర్శి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణశ్రీ, అదనపు కలెక్టర్( రెవిన్యూ) కొప్పుల వెంకట్ రెడ్డి లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశ ప్రారంభంలో జిల్లా కలెక్టర్ వివిధ శాఖలు చేపట్టిన కార్యక్రమాలను వివరించగా, అనంతరం శాఖల వారీగా అధికారులు తమ పురోగతి నివేదికలను సమర్పించారు.ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 99 రోజుల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, జిల్లా స్థాయిలో కార్యక్రమాల పురోగతిని పరిశీలించేందుకు జిల్లా ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు.పెద్దపల్లి జిల్లాలో అమలైన కార్యక్రమాలు, విజయాలు, వినూత్న చర్యలు, ఇతర జిల్లాలు అనుసరించదగిన ఉత్తమ విధానాలను పొందుపరుస్తూ ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించాలని సూచించారు.ప్రతి శాఖ 99 రోజుల కార్యక్రమంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, సాధించిన ఫలితాలు, పెండింగ్ అంశాలు, చేపట్టిన పనులు, ప్రస్తుత స్థితి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సంక్షిప్త నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా నమోదు చేయాలని సూచించారు.శాఖలు చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, ప్రత్యేక ప్రచారాలు, ప్రజలకు ఉపయోగపడిన చర్యలను ప్రత్యేకంగా హైలైట్ చేయాలని తెలిపారు. వివిధ పత్రికల్లో ప్రచురితమైన వార్తలు, ఎలక్ట్రానిక్ మీడియా కథనాలు, వార్తా క్లిప్పింగ్స్‌ను కూడా భద్రపరచాలని సూచించారు.జిల్లా స్థాయి పుస్తకం సంక్షిప్తంగా, ఆకర్షణీయంగా ఉండాలని, ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారాలను అందులో పొందుపరచాలని తెలిపారు. ఇతర జిల్లాలు అనుసరించగలిగే కార్యక్రమాలను ప్రత్యేకంగా హైలైట్ చేయాలని సూచించారు.99 రోజుల కార్యక్రమం ద్వారా పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, తాగునీటి సమస్యలు, వృద్ధాప్య పింఛన్లు, గ్రామీణ రహదారులు, మరమ్మతుల వంటి అంశాలు అధికారుల దృష్టికి వచ్చాయని, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మార్చి 2026 నుండి జూన్ 12 వరకు జిల్లాలో 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు.విద్యాశాఖలో సీఎచ్ఎం స్కూల్ విజిట్స్‌లో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని, ఈ విధానాన్ని ఇతర జిల్లాలు అనుసరించాలని సూచించినట్లు తెలిపారు. విద్యార్థుల ఇంగ్లీష్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, తెలుగులో ఐదో ర్యాంకు, గణితంలో ఐదో ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. 340 సమ్మర్ క్యాంపుల ద్వారా 3,500 మంది విద్యార్థులు లబ్ధి పొందారని తెలిపారు.పోషణ రంగంలో తీవ్రమైన పోషకాహార లోపం (సాూవీ) శాతాన్ని 15.6 నుంచి 0.74 శాతానికి తగ్గించామని, అంగన్‌వాడీ పిల్లల్లో స్టంటింగ్ శాతాన్ని 27.5 నుంచి 20.55 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. 706 అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రపరచడంతో పాటు 678 మంది అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ చేశామని, 24,779 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందించామని తెలిపారు. 706 కేంద్రాల్లో గ్యాస్ స్టౌలు, 200 మరుగుదొడ్లు, 50 తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.యాసంగి-2026లో 62,602 మంది రైతుల నుంచి 4,46,066 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.1,057 కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు. ఎస్ఆర్ఎస్పీ ఫేజ్-1 కాలువల డీసిల్టింగ్‌తో చివరి ఆయకట్టు వరకు నీరు అందించినట్లు పేర్కొన్నారు.డిజిటల్ గవర్నెన్స్‌లో భాగంగా 40,300 నీటి కనెక్షన్లను డిజిటలైజ్ చేసినట్లు తెలిపారు. ఎస్సీ సంక్షేమ శాఖ విద్యార్థిని శార్వ్య రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు వెల్లడించారు.జిల్లాలో 263 గ్రామ సభలు నిర్వహించగా, 1,225 ప్రభుత్వ సంస్థలు, 850 కిలోమీటర్ల రహదారులు, 385 కిలోమీటర్ల డ్రైన్లను శుభ్రపరిచినట్లు తెలిపారు. 60 ఆహార భద్రత తనిఖీలు నిర్వహించి 9 కేసులు నమోదు చేసినట్లు, అన్ని పీహెచ్‌సీల పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు.అలైవ్-



అరైవ్ కార్యక్రమంలో భాగంగా 359 అవగాహన కార్యక్రమాలు, 45 యాంటీ డ్రగ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. బాల్య వివాహాల నివారణపై 610 అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.వెల్ఫేర్ వీక్ సందర్భంగా మైనారిటీ శాఖ ద్వారా 300 కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉల్లాస్ పథకం కింద 59,941 మంది మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దగా, 32,912 మంది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. 573 కొత్త స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.9,233 స్వయం సహాయక సంఘాలకు రూ.493.15 కోట్ల బ్యాంకు లింకేజీ అందించామని, మహిళా సాధికారతలో భాగంగా 16 బస్సులను మహిళా స్వయం సహాయక సంఘాలకు అందజేసి ఆర్టీసీకి అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ బస్సుల ద్వారా మహిళా సంఘాలకు స్థిరమైన ఆదాయం సమకూరుతోందని పేర్కొన్నారు.29,471 కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు, మహాలక్ష్మి పథకం కింద 1,18,953 కుటుంబాలకు రూ.500కే 4,73,691 గ్యాస్ సిలిండర్లు అందించినట్లు తెలిపారు. నాబార్డ్ ద్వారా 1,500 మెట్రిక్ టన్నుల గిడ్డంగి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.మే 6న నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 79 కంపెనీలు పాల్గొనగా, 3,515 మంది యువత హాజరై 933 మంది ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. రూ.523.31 కోట్ల పెట్టుబడులు జిల్లాకు ఆకర్షించి 438 ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు పేర్కొన్నారు. మే 18 నుంచి 23 వరకు 255 మంది విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించినట్లు తెలిపారు. 21 ఐఎంఎస్ భవనాలకు శంకుస్థాపన చేసినట్లు పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణశ్రీ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అన్ని డ్రైన్లను శుభ్రపరిచినట్లు, నీటి కనెక్షన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు, పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేసినట్లు వివరించారు. వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలను విస్తృతంగా చేపట్టడం ద్వారా రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మ్ - ఇబ్బందికరంగా మారిందని రైతు ఆరోపణ

**సుల్తానాబాద్, జూన్ 24 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని 2వ వార్డ్ పరిధిలోని సెయింట్ మెరిస్ పాఠశాల వెనుక వైపున ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మ్ ప్రమాదకరంగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు. నిత్యం ఈ రహదారి గుండా అనేక మంది రైతుల తోపాటు వివిధ రైస్ మిల్లులకు వెళ్లే కూలీలు మిల్లు యజమానులు లారీ వాహనదారులు ప్రయాణాలు సాగిస్తారని అలాంటి ఈ ప్రదేశంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ ద్వారా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని విద్యుత్ అధికారులు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రైతులు కాలనీ ప్రజలు ఆరోపిస్తున్నారు. బుధవారం ఉదయం విద్యుత్ ఎర్త్ వైర్ కు కరెంట్ సరఫరా అయి సాయిరాం ఫంక్షన్ హాల్ వారి పెంపుడు శునకం షాక్ తో కాలి మృతి చెందిందని,ఈ సందర్భంగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.అదే స్థానంలో రైతులు కానీ స్కూల్ పిల్లలు ఉంటే ఏమిటి పరిస్థితి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయము పై పలు సార్లు సుల్తానాబాద్ కరెంట్ ఏఈ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు.విద్యుత్ అధికారులకు ట్రాన్స్ఫారం చుట్టు కాంపౌండ్ కానీ చుట్టు ఫినిషింగ్ ఏర్పాటు చేయాలని ఏన్నిసార్లు మొర పెట్టుకున్న వారు పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. వెంటనే ప్రమాదకరమైన ట్రాన్స్ఫారం కు మరమ్మతులు చేసి చుట్టూ మూగజీవాలు ఇతరులు ఎవరు వెళ్ళకుండా ఫెన్సింగ్ లేదా కాంపౌండ్ ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు. ట్రాన్స్ఫారం పక్కనే స్కూల్ ఉందని చిన్న పిల్లలు అటు వైపుగా వస్తూ వెళుతుంటారని గొర్రెలు, పశువులు మేస్తూ వెలుతాయి, నిత్యం ట్రాన్స్ఫంరాం వద్దకు రైతులు అత్యవసర పరిస్థితిలో వెళ్లడం జరుగుతుందని ఇలాంటి ప్రమాదాలు జరగక ముందే విద్యుత్ ట్రాన్స్ఫారం వద్ద వెంటనే తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.ట్రాన్స్కో ఎఇ కిషోర్ ను వివరణ కోరగా : వర్షాల కారణంగా వైర్లు ఎత్తు అవ ుతాయని అనేక సందర్భాలలో సభలు సమావేశా లలో ప్రజలకు వివరిస్తున్నామని ట్రాన్స్ఫార్మర్ లు కింద కాకుండా భీముల సహాయంతో పైన ఏర్పాటు చేయడం జరుగుతుందని ప్రమాదా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వర్షాకాలంలో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయని ప్రజలందరికీ ముందు జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.



### పెద్దమ్మ తల్లి దయ వల్ల నియోజకవర్గ ప్రజలందరూ

# సుభిక్షంగా ఉండాలి

**- మాజీ జిల్లా పరిషత్ సభ్యులు బిజెపి నేత గుర్రాల మల్లేశం**



**సుల్తానాబాద్,జూన్ 24(జనంసాక్షి) :** పెద్దమ్మ తల్లి దయవల్ల పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలందరూ సుభిక్షంగా సుఖ సంతోషాలతో ఉండాలని మాజీ జిల్లా పరిషత్ సభ్యులు బిజెపి నేత గుర్రాల మల్లేశం అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని పూసాల గ్రామంలో ముదిరాజుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాల జాతర అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించగా గుర్రాల మల్లేశం లావణ్య దంపతులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రాల మల్లేశం మాట్లాడుతూ ప్రజలందరూ పాడిపంటలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, పెద్దమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఇంటికో బోనం ఎత్తుకొని మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీగా పెద్దమ్మ గుడి కి తరలివచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గుర్రాల శ్రీనివాస్, ఆశాలు, ఉస్తెం రవీందర్, తోపాటు ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.